క్లుప్తంగా

స్నేహితుల చేయూత



రఘునాథపల్లి: గోవర్ధనగిరిలో అనారోగ్యంతో సింగరపు మల్లేష్ ఇటీవల మృతిచెందగా, కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. సమాచారం తెలుసుకున్న మృతుడి చిన్ననాటి స్నేహితులు అండగా నిలిచారు. ఆదివారం స్నేహితులు గోవర్ధనగిరికి చేరుకొని స్నేహితుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రెండు క్వింటాళ్ల బియ్యం, రూ.22,500 నగదు అందజేసి దాతృత్వం చాటారు. ఆపదలో ఉన్న మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహకారం అందించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అన్నదానం



జనగామ రూరల్: ఫత్తేషాపూర్‌కు చెందిన గాజులపాటి లక్ష్మణ్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం జనగామలోని రాజరాజేశ్వరా వృద్ధాశ్రమంలో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేసి వేడుకలు నిర్వహించారు. అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు మంతేన మణి, భీమ్‌రాజ్, అజయ్, ప్రవీణ్, రాకేష్, ఆరిఫ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని పాంనూర్‌లో స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దాదాపు 200 మందికి జనరల్ చెకప్, షుగర్ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందించారు. అదేవిధంగా శరత్ ఐ హాస్పిటల్ వారి సహకారంతో కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ అవసరమైన 20 మందిని వరంగల్‌కు తరలించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ..

ఘన్‌పూర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లయన్ సభ్యులు గోలి ప్రశాంత్, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, మొగిలి శ్రీధర్ జన్మదినం సందర్భంగా మండలంలోని పాంనూర్‌లో వృద్ధులకు ఉచితంగా దుప్పట్ల పంపిణీ చేశారు. సర్పంచ్ కోతి రేణుకరాములు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కరుణాకర్‌రెడ్డి, సంతోష్, మధుసూదన్, అనీల్, నాయిని విజయ్‌చందర్, హరికిషన్‌రెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

జనసేన పార్టీని ఆదరించాలి

లింగాలఘణపురం: జనసేన పార్టీని ప్రజలు ఆదరించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నియోజకవర్గ కోఆర్డినేటర్ గాదె పృథ్వీ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విహానికి పూలమాల వేసి పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. జనసేన పార్టీ ప్రజాశ్రేయస్సు కోసం సమస్యలపై పోరాడుతుందని అన్నారు. సమావేశంలో నాయకులు బైరపాక కృపాకర్, గణేష్, నవీన్, రజాక్, పవన్, సాయి, వినయ్, రేవంత్, క్రాంతి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఫిర్యాదు

చిల్పూరు: మండల కేంద్రానికి చెందిన కాపాని లింగయ్యకు చెందిన వ్యవసాయ బావి వద్ద రెండు బోరు మోటార్లకు చెందిన స్టాటర్లను శనివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధిత రైతు అందించిన వివరాలు.. లింగయ్యకు 4 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో రెండు బోరు మోటార్లు ఉన్నాయి. ఇటీవల పొలంలో నాటు వేశాడు. శనివారం మధ్యాహ్నం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లగా రెండు బోరు మోటార్లకు చెందిన స్టాటర్లను గుర్తు తెలియని వ్యక్తులు వైర్లను కట్ చేసి ఎత్తుకెళ్లారు. తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. లింగయ్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.

గీతకార్మికుడికి తీవ్రగాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్: తాటిచెట్టు పై నుంచి ప్రమాదవశాత్తు జారి పడగా కన్న గట్టయ్య అనే గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని సముద్రాలలో ఆదివారం జరిగింది. సముద్రాలకు చెందిన కన్న గట్టయ్య అనే గీత కార్మికుడు గీత వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో రోజు మాదిరిగానే కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు మోకుజారి కిందపడగా తీవ్రంగా గాయపడ్డాడు. కాగా, గమనించిన చుట్టుపక్కల వారు బాధితుడిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



దేవరుప్పుల: ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై రమేష్‌నాయక్



చిల్పూరు: వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై వినయ్‌కుమార్

పాలకుర్తి/కొడకండ్ల: ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పాలకుర్తి సీఐ డి. విశ్వేశ్వర్ హెచ్చరించారు. ఆదివారం పీఎస్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆటో నడిపే వ్యక్తులు తప్పక డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు కలిగి ఉండాలని, ఆటోలో ప్రయాణించే వారిపట్ల గౌరవంగా మాట్లాడాలని, మ్యూజిక్ సిస్టం, లౌడ్ స్పీకర్లు వినియోగించరాదని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొవద్దని సీఐ సూచించారు. ప్రయాణీకులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని, నిబంధనలు ఉల్లంగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఎస్సై కొమురెల్లి, ఏఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

దేవరుప్పుల : ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా కఠిన చర్యలకు గురవుతారని ఎస్సై ఎం.రమేష్‌నాయక్ తెలిపారు. మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లు ప్రమాదాల నివారణకు పాటుపడాల్సిన తీరుపై కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆటో వ్యాలీడ్ ఇన్సూరెన్స్, పొల్యూషన్ ఫిట్నెస్, ఇతర సర్టిఫికెట్లు విధిగా కలిగి ఉండాలన్నారు. గుర్తు తెలియని, అనుమానాస్పద వ్యక్తులు సంచరించినట్లయితే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత ఆటోను కూడా సీజ్ చేయడం జరుగుతుందన్నారు.

సరైన పత్రాలు కలిగి ఉండాలి

చిల్పూరు: వాహన చోదకులు సరైన పత్రాలు కలిగి ఉండాలని, లేకుంటే కేసులు తప్పవని ఎస్సై వినయ్‌కుమార్ అన్నారు. చిన్నపెండ్యాల సమీపంలో జాతీయ రహదరిపై ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైన్‌స్నాచింగ్ జరుగుతున్నందున వాటి నివారణతో పాటు వాహనాలకు సంబంధించిన పత్రాలను సీపీ ఆదేశాల మేరకు తనిఖీ చేస్తున్నామన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

బచ్చన్నపేట: ద్విచక్రవాహన దారులు తమ వాహనాలను నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్లను వినియోగించాలని ఎస్సై నవీన్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాలను నడిపేటప్పుడు మద్యం సేవించకూడదని, త్రిపుల్ రైడింగ్, అతి స్పీడ్‌తో వెళ్లకూడదన్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలను రోడ్డు పైకి తీసుకవస్తే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఎస్సై సృజన్‌కుమార్, పలువురు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కేసీఆర్‌వైపే దేశప్రజల చూపు



జఫర్‌గఢ్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య



కల్లు తాగుతున్న ఎమ్మెల్యే

జఫర్‌గఢ్: కేసీఆర్‌వైపే దేశప్రజలు చూస్తున్నారని, దేశప్రధాని కావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పేర్కొన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని జఫర్‌గఢ్‌లో రూ.కోటి 34 లక్షల వ్యయంతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. దేశంలో ప్రధాని నరేంద్రమోదీ రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపథంలో ముందుకు తీసుకువెళ్లిన కేసీఆర్ భారత దేశాన్ని కూడా అభివృద్ధిపథంలో నడిపించేందుకు టీఆర్‌ఎస్‌ను బీఆర్‌ఎస్‌గా మార్చడం జరిగిందన్నారు. ఎంపీపీ రడపాక సుదర్శన్, జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబిశ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుజ్జారి రాజు, సర్పంచ్ భల్లెపు నర్సింగరావు, ఎంపీటీసీలు జ్యోతి రజితయాకయ్య, స్రవంతిమొగిలి, వైస్‌ఎంపీపీ కనకయ్య, టీఆర్‌ఎస్‌మండలపార్టీ అధ్యక్షుడు జయపాల్‌రెడ్డి, మార్కెట్‌డైరెక్టర్ వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన..

తిమ్మంపేటలో రూ.20లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే రాజయ్య ఆదివారం శంకుస్థాపనలు చేశారు. గ్రామంలో రూ.10లక్షల నిధులతో నిర్మించనున్న మహిళా కమ్యూనిటీహాల్, ఎస్సీ కమ్యూనిటీహాల్ నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. అదే విధంగా గ్రామంలో రూ.10లక్షల నిధులతో చేపడుతున్న గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. నాయకులు, గౌడకులస్తులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. కాగా, గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేసిన అనంతరం గీత కార్మికుల అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే రాజయ్య కల్లు తాగి గీత కార్మికులను ఉత్సాహపరిచారు.


నిధులు మంజూరు చేయండి

చిల్పూరు: వంగాలపల్లి గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఆదివారం ఆ గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు హనుమకొండలో ఎమ్మెల్యే రాజయ్యను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ అరూరి ప్రణిత ప్రదీప్, గ్రామ శాఖ అధ్యక్షుడు చిట్యాల దయాకర్, మండల యూత్ ఉపాధ్యక్షుడు అరూరి రవిచందర్ మాట్లాడుతూ గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు చేయాల్సి ఉందని.. అందుకు నిధులు మంజూరు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్కాల నగేష్, రాజయ్య, భూక్య గోపి, సుధాకర్, కార్తీక్, కొంగ రాజు ఉన్నారు.

కోతుల హల్‌చల్



రైల్వేస్టేషన్ ఆవరణలో కోతుల సంచారం



సిద్దిపేట-జనగామ ప్రధాన రహదారి బచ్చన్నపేట పరిసర ప్రాంతంలో కోతులు

జనగామ: కోతుల సంచారం జిల్లా ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. జనగామ రైల్వే స్టేషన్ ఆవరణలో ప్రతి రోజు వందలాది కోతులు హల్‌చల్ చేస్తున్నాయి. రెండు ఫ్లాట్‌ఫాంలపై సంచరిస్తూ ప్రయాణికులను పరుగులు పెట్టిస్తున్నాయి. సంక్రాంతి పండగ నేపథ్యంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారు రైలు దిగగానే.. కోతులను చూసి భయాందోళనకు గురవుతున్నారు. అలాగే సిద్దిపేట-జనగామ ప్రధాన రహదారి శామీర్‌పేట, చంపక్‌హిల్స్, తమ్మడపల్లి, బచ్చన్నపేట పరిసర ప్రాంతాల్లో రోడ్డుకు అడ్డంగా వందల సంఖ్యలో కోతులు వాహన చోదకులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. దీంతో ద్విచక్రవాహనాలపై వెళ్లే వారు కోతుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. అటవీశాఖ అధికారులు చొరవ తీసుకుని కోతుల బాధ నుంచి తప్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న వెంకట్‌రెడ్డి

తరిగొప్పుల: మండలకేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన సాయబోయిన నర్సయ్య అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. కాగా, వైఎస్సార్టీపీ జనగామ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. రూ.3వేల ఆర్థిక సాయంతో పాటు 50 కేజీల బియ్యం అందజేశారు. నాయకులు బూరగోని శ్రీకాంత్ గౌడ్, పాము రఘు, పాము సత్యనారాయణ, గాలి యాదయ్య, రవి, ఆగయ్య, పండుగ శ్రీకాంత్, ఐలయ్య, నర్సంహులు, కుమారస్వామి, చారి ఉన్నారు.

ప్రతి తండాలో సేవాలాల్ సేన



సేవాలాల్ సేన నూతన కమిటీ సభ్యులు

నర్మెట: ప్రతి తండాలో సేవాలాల్ మహారాజ్ సేనలు ఏర్పాటు చేయాలని, సేవాలాల్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని సేన జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ మహేందర్ అన్నారు. సేవాలాల్ సేన విస్తరణలో భాగంగా మల్కపేట తండాలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో తండావాసులు కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బానోత్ సురేష్, ఉపాధ్యక్షులుగా బానో త్ యాకూబ్, కొంరెల్లి, ప్రధాన కార్యదర్శిగా అశోక్, అధికార ప్రతినిధులుగా రవీందర్, బాల్‌సింగ్, కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా లక్పతి, ప్రచార కార్యదర్శిగా సుమన్‌లతో పాటుగా సభ్యులను ఎన్నుకున్నారు.

15న సంక్రాంతి ముగ్గుల పోటీలు



మాట్లాడుతున్న కిషన్‌రాజ్

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక స్పోర్ట్స్ అండ్ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి జంట పట్టణాల్లో ఈనెల 15న సంక్రాంతి పర్వదినం సందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు అంబటి కిషన్‌రాజ్, కార్యదర్శి పెసరు సారయ్య తెలిపారు. డివిజన్‌కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక స్పోర్ట్స్ అండ్ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామని, అదే క్రమంలో ఈ ఏడాది ముగ్గుల పోటీలు ఉంటాయన్నారు. సంక్రాంతి రోజున ఇళ్ల ముంగిళ్లలో వేసిన ముగ్గులను పరిశీలించి ఎంపిక చేస్తారని, జంటపట్టణాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఎంపికైన వారికి ఈ నెల 16న స్థానిక మాగార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో బహుమతులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు ఎండీ.ఖాజామోహినోద్దీన్, యంజాల ప్రభాకర్, గోలి రాజశేఖర్, బంగ్లా శ్రీను,అక్కినపెల్లి అంజయ్య, ఎం.ఉపేందర్, గట్టు రమేష్, కార్తీక్, గట్టు కోటి, శ్రీకాంత్, భాను, మల్లేశం, శేఖర్, రమేష్, యాకుబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో జాతీయ రహదారి



నెల్లుట్ల వద్ద చీకటిమయంగా ఉన్న నేషనల్ హైవే

లింగాలఘణపురం: జనగామ-సూర్యాపేట నేషనల్ హైవేలో లింగాలఘణపురం మండల పరిధిలోని నెల్లుట్ల వద్ద సుమారు కిలో మీటరు వరకు ఉన్న హైమాస్ట్ లైట్లు గత నాలుగు రోజులుగా వెలగడంలేదు. కొద్ది రోజులుగా విద్యుత్ బిల్లు చెల్లించకపోవడంతో ట్రాన్స్‌కో అధికారులు లైట్ల కనెక్షన్‌ను తొలగించారు. దీంతో నెల్లుట్ల మొదలు కొని చివరి వరకూ సుమారు కిలో మీటర్ రోడ్డంతా అంధకారం నెలకొంది. అసలే జాతీయ రహదారి తరుచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. నాలుగు రోజులుగా రోడ్డంతా చీకటిమయంగా ఉన్నప్పటికీ అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదు. వీటి నిర్వహణ నేషనల్ హైవే అధికారులకు ఉంటుంది. రెండు నెలలుగా విద్యుత్ బిల్లు చెల్లించకపోవడంతో సుమారు రూ.4 లక్షలకు పైగా బకాయి పడడంతో విద్యుత్ కనెక్షన్ తొలగించినట్లు ట్రాన్స్‌కో ఏఈ శంకరయ్య తెలిపారు. ఇదిలా ఉండగా రోడ్డు ప్రమాదాలు, నేరాలు జరిగినప్పుడు గుర్తించేందుకు పోలీసులు రోడ్డుపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రోడ్డంతా అంధకారం కావడంతో ఆ కెమెరాల్లో రికార్డు కాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నేషనల్ హైవేపై లైట్లు వెలిగే విధంగా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



జనగామ రూరల్: జనగామ మండలంలోని చీటకోడూర్‌కు చెందిన సోనబోయిన కోటయ్య ఇటీవల ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, రూ. లక్షల ఖర్చు కావడంతో కుటుంబం ఇబ్బంది పడుతుండగా విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకుడు నాగపూరి కిరణ్ చొరవ తీసుకొని బాధిత కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి రూ.60 వేల చెక్కును ఆదివారం కోటయ్య కుమారుడు రాజశేఖర్‌కు అందజేశారు. వేముల లక్ష్మణ్, సతీష్, ఉదయ్‌కుమార్, రాజు, శ్రీకాంతా చారి, సమ్మయ్య పాల్గొన్నారు.

విహారయాత్రకు విద్యార్థులు



గోల్కొండ సందర్శనలో విస్నూరు విద్యార్థులు

పాలకుర్తి టౌన్: మండలంలోని విస్నూరు ప్రాథమిక పాఠశాల ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు ఆదివారం విజ్ఞాన విహార యాత్రకు తరలివెళ్లారు. హైదరాబాద్‌లోని చార్మినార్, గోల్కొండ, యాదాద్రిని సందర్శించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెనుగొండ సోమన్న తెలిపారు. ఈ యాత్రలో ఎస్ఎంసీ చైర్మన్ పోలాస సోమయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పొదుపు.. భవిష్యత్‌కు భరోసా



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

రఘునాథపల్లి: నేటి పొదుపు భవిష్యత్‌కు భరోషాగా ఉంటుందని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి పొదుపు సంఘం వ్యవస్థాపకులు, రిటైర్డ్ హెచ్ఎం మేకల శంకరయ్య అన్నారు. ఆదివారం మండలంలోని ఇబ్రహీంపూర్‌లో లక్ష్మీనర్సింహ సహకార పొదుపు సంఘం సిల్వర్‌జూబ్లీ (25వ వార్షిక) సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం అధ్యక్షుడు మోర్తాల మహేందర్, యాదగిరి, అబ్బయ్య, శ్రీనివాస్, మైసారావు, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, ప్రహ్లాద, అశోక్‌రెడ్డి, బర్ల రా మచంద్రం, వె ంకన్న, మల్లయ్య, సత్తయ్య, కిషన్‌రా వు, ఉమ, అరుణ, పుతిలీబాయి, ప్రమీల ఉన్నారు.

నూతన కమిటీ ఏర్పాటు..

పరపతి సంఘం సభ్యులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోర్తాల మహేందర్, ప్రధాన కార్యదర్శిగా మేకల శంకరయ్య, ఉపాధ్యక్షులు దొరగొల్ల యాదగిరి, అంబీరు అరుణ, కోశాధికారి పబ్బ రమేష్, సహయ కార్యదర్శులు కుత్రాల రాజు, దామెర వెంకన్న, సలహా కమి టీ సభ్యులు గాజులపాటి మైసారావు, మేకల శ్రీనివాస్‌రెడ్డి, బండ్ర రామచంద్రం, మేకల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు దొరగొల్ల కుమార్, గట్టయ్య, లక్ష్మయ్య, ఉమలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



దేవరుప్పులలో 1979 టెన్త్ బ్యాచ్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు



బచ్చన్నపేట: పోచన్నపేట 1990-91 ఎస్ఎస్‌సీ బ్యాచ్..



జనగామ రూరల్: జనగామ ఏబీవీ హైస్కూల్ 1980-81 బ్యాచ్ విద్యార్థులు



రఘునాథపల్లి: ఖిలాషాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2001-02..

జిల్లాలోని పలు పాఠశాలల్లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆనందంగా గడిపారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

- దేవరుప్పుల/బచ్చన్నపేట/జనగామ రూరల్/రఘునాథపల్లి

ఎదురులేని ఏకపాత్రాభినయం!

- ప్రాచీన కళలో రాణిస్తున్న రవీందర్
- ప్రభుత్వం ప్రోత్సహించాలని వేడుకోలు


చిల్పూరు: రాముడు, భీముడు, కృష్ణుడు, రావణుడు, విశ్వామిత్రుడు, దుర్యోధనుడు, అర్జునుడు ఇలా.. ఏ పాత్రకైనా ప్రాణం పోస్తాడు చిల్పూరు మండలం కృష్ణాజీగూడెం గ్రామానికి చెందిన అక్కినేపల్లి రవీందర్. ఆయనకు ప్రాచీన కళలంటే బాల్యం నుంచి ప్రీతి. పాఠశాల స్థాయిలో ఉప్పుకప్పురంబు పద్యాన్ని పౌరాణిక గీతంగా పాడాడు. అది గమనించిన అప్పటి చాగల్లు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు రామస్వామి, కొండల్‌రావు పౌరాణిక నాటకాలు వేయాలని రవీందర్‌ను ప్రోత్సహించారు. నాటకాలపై శిక్షణనిచ్చారు. అనంతరం శ్రీవేణుగోపాల నాట్యకళా మండలిలో చేరాడు. అప్పట్నుంచి ఏకపాత్రాభినయంలో ఆకట్టుకుంటున్నాడు. ప్రస్తుతం ప్రభుత్వం, దాతల నుంచి ప్రోత్సాహం కరువైంది.

ప్రభుత్వం ఆదుకోవాలి..



గతంలో ఎన్నో నాటకాలు ప్రదర్శించా. రవీంద్రభారతిలో అవార్డు అందుకున్నా. ఎక్కడైనా పౌరాణిక పద్య నాటిక ఏకపాత్రతో వేయాలన్నా.. దాదాపు రూ.10 వేలు ఖర్చువస్తోంది. ఏపీలో అక్కడి సీఎం జగన్ ప్రాచీన కళలకు ప్రోత్సాహం అందిస్తున్నారు. కళాకారులకు గుర్తింపునిచ్చారు. ఇక్కడ కూడా కళాకారులకు గుర్తింపునివ్వాలి. ప్రాచీన కళలకు జీవం పోయాలి.

- అక్కినేపల్లి రవీందర్, కళాకారుడు, కృష్ణాజీగూడెం



దుర్యోధనుడి పాత్రలో రవీందర్